
# జాని

అరుణకిరణ్



సాయిం కాలం ఆరు గంటలవుతోంది.

కొండ చిలువలా చీకటి వెలుతురును కబళిస్తోంది. అయినా నిరుపేద ఆశలా అరుణ కిరణాలు పడమటి దిక్కున చెట్లపై కనిపిస్తున్నాయ్. .

రంగడు రిక్షాను తొక్కడం మాని, అద్దె డబ్బులూ రిక్షా తన షావుకారికి యిచ్చేసి ఇంటి ముఖం పట్టాడు.

"ఇప్పుడు రంగడు టౌనుకు రెండు మైళ్ళదూరంలో వున్న మాలపేట చేరుకోవాలి తను ఎండనక, వాననక కూలి డబ్బులకోసం మానవత్వం వున్న మనుషులను, మానవత్వంలేని మానవుల రూపంలో వున్న దానవులను, బుద్ధదేవుల్లాంటి దయామయులను, నిర్దయ-ఈర్ష్య బాగా జీర్ణించుకోపోయిన వాళ్ళను యింకా.... యింకా అనేక మనస్తత్వాలున్న వాళ్ళను తన రిక్షాలో కూర్చోపెట్టి రక్తాన్నే చమట రూపంలో అర్పించి వాళ్ళ స్థలాలకు చేర్చడమే తను పదిహేను సంవత్సరాలనుండి

రోజూ దొరికినదానికన్నా ఆ రోజు తక్కువ డబ్బులు దొరికాయి దొరికిన నాలుగున్నర రూపాయల్లో ఓ రూపాయిన్నర బండి అద్దెకుపోగా, మరోరూపాయి సాదా ఖర్చులకు పోగా మిగిలిన రెండు రూపాయలు తన బ్రతుకులా చివిగిపోయి, మాసి కొనవూపిరితో వున్న మనీపర్సులో వుంచి, తాపీగా తనకాకీ నిక్కరు జేబులోంచి బీడిని తీసి వెలిగించి, ఆర్చుకుపోయి-జీవం లేనట్లుండె పెదాలకు అందించాడు తృప్తిగా.

---

జాలి—సుక్కేసుకొనే ప్రతి మగరాయుడూ పరాయివాడి పెళ్ళాం మీద చూపే అత్యంత అపేక్ష. తన పెళ్ళాం విషయంలో మాత్రం జాలికి అర్థం తన్నులు, తాపులు.

---

చేస్తున్నపని. అలా రెక్కలు ముక్కలు చేసుకునిసంపాదిస్తున్న ఆ కాస్త సంపాదనపై పెళ్ళాం. నలుగురు పిల్లలూ గూట్లో పక్షుల్లా సుడిగాలిలో దీపాల్లా కడుపులో రగుల్తున్న ఆకలి మంటలకు అలవాటుపడి యాంత్రికంగా రంగడికోసం పూరి పాకలోంచి కొండంత ఆశతో చూస్తుంటారు.

ఆ రోజూ ఉదయమే పుట్టిపై వున్న కుండలో కాస్త చద్దివన్నం తిని మిగతాది పెళ్ళాం పిల్లలకు వుంచి కొంపవిడిచాడు రంగడు.

బీడిపొగ దట్టంగా వదుల్తూ మూడు రోడ్ల జంక్షన్ దాటి ఓ చిన్న యిరుకైన సందులోకి తిరిగాడు. రంగడు. కొంత దూరంలో మనుషులు గుమిగూడి ఉండడం చూశాడు కొందరు దగ్గరలో వున్నపాన్ షాపు దగ్గర విడ్డూరంగా చూస్తుండడం కూడా చూశాడు. రంగడు జనాన్ని తప్పించుకుని మరో సందుదాటి ఓ మైలు దూరం నడిస్తే తను మాలపేట చేరుతాడు. అంచాత ఆ ప్రయత్నంలో గుమిగూడిన వార్ని తప్పించుకుంటూ వెళ్తున్న రంగ

టికి. "ఏటి ఎరగని దానిలా విలవిలా పోతావేంటే నంజా.... నా యిచ్చిన నిన్నటి అయిదు రూపాయలూ ఏ రంకుమొగుడికి యిచ్చేసినావ్?.... అర్ధరూపాయి డబ్బులు యివ్వవూ? తీరా మోసినా నడిగితే ఇరు సుకు వస్తావేం నంజా...." యింకాఏవేవో నోటి కొచ్చిన బూతులు చెవిలో పడ్డాయి.

"ఎవరూ? బంగారిలా వుందే గుమి గూడిన వాళ్ళని తప్పించుకుంటూ వెళ్ళి చూశాడు రంగడు

ఓ మాసిన లుంగీ కట్టుకుని తలపై ఓ తువ్వాలు చుట్టి వుగ్రరూపం దాల్చి నరరూపరాక్షసుడిలా వున్నాడో మగవాడు. వాడికి కొంత దూరంలో పూరిపాక వంట వాకిట్లో జుత్తులు విరబోసుకుని. పైట నేలపై పడి వెక్కి వెక్కి మని తోడేలును చూసిన మేకలా బిత్తరపోతూ ఏడ్వడానిక్కూడా శక్తిలేక, ముడుచుకుని కంట తడి పెడ్తుంది ఓ ఆడది. అప్పుడర్ధమయ్యింది రంగడికి. తన నేస్తం ఈ మధ్య పెళ్ళాడిన రెండవ పెళ్ళామని అలా వాడు ఉగ్ర రూపం దాలుస్తూ విరుచు పడడానికికారణం కూడా యిట్టే పసిగట్టేశాడు. రంగడు - సారా డబ్బులకోసమని.


బంగారి మొదటి పెళ్లాం కూడా ఇలాగే వీడితో నానా బాధలూ పడి చివరకు ఎవడో టాక్సీ డ్రైవరుతో లేచిపోయింది.

"ఇంకా యీడి బుద్ధి మారనేదు మాట!" నెమ్మదిగా లోలోపల అను కున్నాడు.

రంగడు చుట్టు ప్రక్కల ఓసారి చూశాడు. ఎక్కడి వాళ్ళక్కడ ఏదో సిని మాలో సీనులా చూస్తున్నారు. దెబ్బలాట ఆపడానిక్కి ఎవ్వరూ ప్రయత్నించడం లేదు. పాన్‌షాపు వద్ద ఎందరో చైనా బులూ. గొట్టం పంట్లామబ్బాయిలూ ఎంతో 'ఇంటరెస్టింగ్'గా కిళ్ళీ నములుతూ సిగరెట్టు పొగ గుప్పు గుప్పున వదుల్తూ చూస్తున్నారు. అందరివైపు అదోలా చూసి పైనున్న చింకిలోపి సర్దుకుంటూ బంగారి వద్దకు వెళ్ళాడు రంగడు. జాలి గుండెగల వాడిలా.

ఇంతలో. "నన్ను సంపేసినా ఒక్క పైసా కూడా లేదు. వారానికి ఒక్కపారి యిచ్చే నీ బత్తేమిటి సరిపోతున్నా దను కున్నావ్? నువ్విచ్చిన అయిదు రూపా యలూ అప్పులు తీర్చేసరికే అయిపోనాది. ఈ పూట కూడుకే సరిపోనేదు. ఇంకా సుక్కేసుకోడానికి డబ్బులు కావాలట.... సిగ్గునేదూ? ఎదవ జనమానికి. నన్ను సంపేసినా ఒక్కపైసా కూడా నేదు...." ఏవేవో అతికష్టంపై బొంగురు పోయిన కంఠంతో. నీరసించిన కనుచూపులతో. ఎండిన పెదాలతో అన్నాదోలేదో ఒక్క దుటున ప్రక్కనున్న దుడ్డు కర్ర తీసి.

"సంపేసినా యివ్వవు కదూ? అయితే సూస్తా ఎట్టాగ ఇవ్వవో' అంటూ పెళ్లాం పైకి వెళ్ళేసరికి రంగడు అడ్డుకున్నాడు. ఆపుతున్న రంగడ్ని చూసి, "ఒరే రంగా! నువ్వడ్డంరాక దానిపొగరేదో కట్టించేస్తాను




వదులు....వదులు... "రంగడ్ని విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు బంగారి.

"ఒరే బంగారి ఏట్రామరీ అంత కోపం. ఆ ఆడకూతురు కాడ డబ్బులేందే ఎలాగిస్తాదేహే" బంగారి భుజాల్ని తన రెండు చేతుల్తో పట్టుకుని. "ఏంటి సూస్తారు? మొగుడూ పెళ్ళాల దెబ్బలాట అంతే....అంతే....అందరి కొంపల్లో వున్నాయే కదా? రంగడు గుంపునంతటిని చెల్లా చెదరు చేస్తూ దూరంగా వున్న పశువుల పాక దగ్గరకు తీసుకుని పోయాడు.

బంగారి చికాకుగా ఏదో చెప్తుండగా "ఒరె బంగారి ఒళ్లకుండెహె....అందుకు ఆడకూతుర్ని పట్టుకుని కొడ్తావా?" సముదాయిస్తూ అన్నాడు రంగడు.

బంగారి మాట్లాడలేదు.

"ఆ విషయం ఒగ్గేసి - నీకో మంచి మాట సెబుదామని వచ్చినాను. ఇంటావా మరి?"

'ఏటి రంగా?" ఒక్కసారి యీ లోకంలోనికి వచ్చి పడ్డట్టు ఆత్రంగా ప్రశ్నించాడు బంగారి.

'అదేటంటే మన షావుకారు కొత్త రిక్షా తెప్పించాడు.

రెండు రోజుల్లో అద్దెకు యిస్తాడట. నువ్వీ టయింలో ఎల్లావంటె తప్పకుండా యిస్తాడు. కానామటుకు నీకు యిబ్బంది తగ్గిపోతాది?"

బంగారి ఓ క్షణం సందేహిస్తున్నట్టుండిపోయాడు.

"ఏంట్రా! ఏటలా సూస్తావ్," అడిగాడు అనుమానంగా రంగడు.

"అది కాదు. అడు నాకిస్తాడా? అడితో తగువెట్టుకుని మూ నే శా ను కద్రా! అందుకు ..."


"ఓసి అదా నీ అనుమానం! అలా అనుకోకు షావుకారిగాడ్కి బుద్ధి వచ్చినాది. ఆయాల దెబ్బలాట నారిగాడు సెప్పుడు మాటల ఒల్లని తెలుసుకున్నాడ్రా అయినా నానుండగా నీకేటి భయం, నాను యీయేలే సెప్పాను నీకే యియ్యమని. ఎట్టాగయినా నువ్వు యిప్పుడే ఎల్లి అగు వద్దావంటె కానా మంచిది నాను సెప్పినట్టు యినుకో-ఎళ్ళు..." ఓ బీకీకి బంగారి పెళ్ళాలకు అందిస్తూ షావుకారు యింటికి పంపించాడు రంగడు.

పొంగటను నీర్సంగా. పీక్కుపోయిన ముఖంతో అదోలా పరాకుగా వున్న బంగారి పెళ్ళాం వద్దకు వెళ్ళి "సెల్లెమ్మా! వూరుకో - బంగార్ని షావుకారి కాడకు తీసుకెళ్ళేను. రెండ్రోజుల్లో కట్టాలు గట్టెక్కుతాయిలే - దబ్బుల్లేకే వాడు సిర సిర లాడుతున్నాడే కాని కానా మంచోడు కీగాలెట్టే ఏళ్ళకు కన్నీరు ఎట్ట కూడదు. వూరుకో-సెల్లెమ్మా-వూరుకో" మహా జాలి సహృదయత. కరుణ మూర్తీభవించిన మనిషిలా రంగడు ఆమెపై చెప్ప లేనంత వింత మనసూ ఆప్యాయత చూపాడు.

ఎంతో జాలి అభిమానంతో తగవు తల్లార్చిన రంగడివేపు కృతజ్ఞతా భావంతో చూపింది బంగారి పెళ్ళాం-అలా ఆమె చూడడం రంగడు గమనించక పోలేదు.

అస్తవ్యస్తంగా వున్న వెలిసిపోయిన చీరను ఓసారి సర్దుకుని మరేమి మాటాడ లేక ఉయ్యాలలో గగ్గోలు పెడ్తున్న పసి బిడ్డను తీసేందుకు బంగారి పెళ్ళాం లోనికి వెళ్ళిపోయింది రంగడు ఎంతో సంతృప్తితో సందుమలుపు తిరిగాడు-ఓ పారి బంగారి పెళ్ళాం తన వేపు చూపిన కృతజ్ఞతా భావం కళ్ళెదుట మెరుపులా మెరవడంతో. "బంగారి పెళ్ళాం ఆ చుట్టూ వున్న పైబాబులవైపు గొట్టం వంట్లాముబ్బాయిల వైపు యింకా సుట్టూ మూగిన వాళ్ళ వైపు ఎంచాత సూడనేదు? అవును! ఎందుకలా! సూస్తాది .. సూడదు, ఆళ్ళు మనుషులు కారు జాలి అనతే లేనోళ్ళు. సమయానికి ఎళ్ళి ఆదుకోకపోతే ఆ అరకూతురు గతేం కాను?" అనేక విధాలు తనను తాను విశాల హృదయంపైన జాలిపైన మనస్సులో ఎదోలా పొగుడుకుంటూ మాలపేట సమీపించాడు.

పేదవాని దరిద్రంలా కారు చీకటి వికటాట్ట హాసం చేస్తూ దట్టంగా మాలపేటంతా వ్యాపించింది. మ్యూన్సిపల్ వారు వేసిన లైట్లు వున్నాయి—అవి పేరుకి మటుకే అలా ఉన్నాయి. అవి వెలుతురు విచ్చే లైట్లుకావు-చీకటితో రాజీపడి ఊరుకున్న లైట్లవి. సంవత్సరం మొత్తం




పై ఏ గాంధీ జయంతి నాడో తప్ప తతిమ్మా రోజుల్లో వాటి జోలికి అసలే పోరు మ్యునిసిపాలిటీ వాళ్లు- అందాక అవి చీకటిలో ఎత్తుగా సన్నంగా ఇనుప స్తంభాల్లా మటుకు కనిపిస్తాయి.

రంగడు కొంపకు చేరుకోగానే ఎదురు చూస్తున్న పిల్లలు 'అయ్యా! అయ్యా' అంటూ చుట్టూ చేరారు. తను తెచ్చిన కొబ్బరి బరిపీలు యిస్తూ ముద్దు పెట్టుకున్నాడు. బరిపీలు పట్టుకుని ఎంతో ఆనందంతో గెంతులు వేస్తూ లేని శక్తి కూడ గట్టుకుని దూరంగా ఓ మూలకు పోయి చప్పరిస్తూ కూర్చున్నారు.

వాకిట్లో వున్న గోలెండు నీళ్ళు పోసుకుని ఓ లుంగీ కట్టుకుని, చిరిగిన బనీను పైన వేసుకుని హుషారుగా బయటకు వెళ్ళడానికి దారితీశాడు. అలా వెళ్ళిపోతున్న రంగణ్ణి చూసి, "అట్టా పోతే ఎట్టా? కూడొండాలా వద్దా! అసలే పిల్లలు ఆకల్తో సుట్టుకుపోతున్నారు, [illegible] దబ్బులిచ్చి ఎళ్ళు" అస్థిపంజరంలా వున్న సీతాలు పసివాడికి పాలిస్తూ నెమ్మదిగా అంది.

సీతాలు మాటలు చెవిలో పడ్డ రంగడు ఒక్కసారి వెనక్కి వచ్చి సీతాలు ప్రక్క కూర్చున్నాడు.

"అరే మరచిపోయాను! ఇదిగో.... తీసుకో..." ఓ నాలుగు పావలాలు చేతిలో పెట్టాడు.

"ఇదేవిటి యింతే యిచ్చినావు! .. ముష్టి రూపాయలతో నానేటి సేసేది!" నిర్లక్ష్యంగా. ఆ నిర్లక్ష్యంలో తనలేమి తనాన్ని బతుకును కూడా అసహ్యించుకునే టట్లు అంది సీతాలు.

"ఈయేల బేరముంటేగా, ఇంతే దొరికినాది. నానేం సేసేది!" నీరసించిన సీతాలు కళ్ళల్లో కళ్ళు కలిపి, వాడిన గులాబి రేకుల్లాంటి బుగ్గలపై చిటికవేస్తూ చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు రంగడు.

"పొల్లే సరసాలు ఎప్పుడూ వున్నా యేగా. సరసాలకేం కొదవ....ఇంతకీ నువ్వు సెప్పు ఈ రూపాయితో నన్నేం సెయ్యమంటావ్!" భుజంపై మోడు బారిన చెట్టుకొమ్మలా వున్న రంగడి చేతిని తొలగిస్తూ సీతాలు సూటిగా అడిగింది.

"అప్పుడే అలా అంటావ్! యీ ఏళ కూలి కెల్తానన్నావ్ ఆ రూపాయిన్నర ఏం చేసినా వేమిటి!"

"ఇదా నీ నిబ్బరం! ఈ యేల ఒక పూట కూలే సేసాను. ఆ కంట్రాక్టరు బాబు రెండో పూట పని కొందరికే యిచ్చినాడు. కానా మందిని ఈయేల తీసేసాడు—ఒక పావలా టీలకు పోగా అర్ధరూపాయే మిగిలి నాది."

"అట్టాగా!"

"............"

"అయితే నా విచ్చిన డబ్బుల్తో బియ్యం కొను. నీ కూలి డబ్బులతో సేపలేవైనా తెచ్చి వండు. ఆనక సంగతి ఆనక సూసు కుందాం. ఇప్పుడే వత్తాను" తలకు చింకి తువ్వాలు కట్టుకుంటూ వెళ్ళిపోయాడు సీతాలు ఏదో సొనగడం ప్రారంభించింది. ఆ సొనగడం రంగడి చెవిలో పడక పోలేదు. అయినా విపి వినబడనట్లు మెల్లగా వెళ్ళిపోయాడు.

* * *

సుమారు రాత్రి తొమ్మిది గంటలవు తోంది.

మాలపేట కొంపల్లోంచి దీపాల వెలు తురు చీకటిని తరిమేందుకు శాయశక్తుల ప్రయాసపడుతున్నాయి. తాగి వచ్చినవాళ్ళ మాటలూ, పాటలూ వినబడుతున్నాయి. వాళ్ళ మీద నిశ్శబ్దంగా పేలుతున్న తుపాకీల చప్పుడు మన చెవులకు సోకదు.

సీతాలు పుటుకు చంటివాడ్ని ఒడిలో వేసుకుని పాకలోంచి పరధ్యానంగా బయట వాకిట్లోకి చూస్తోంది, బయట్నించి వచ్చిన చిరుగాలిలో తైల సంస్కారం లేని జుత్తు ఎగిరి దీపపు కాంతిలో ఎర్రగా మెరుస్తోంది. శూన్యంలోకి చూస్తున్న సీతాలు మనస్సు ఒక్కసారి గతంలోకి జారిపోయింది.

• • •

అవి రంగడితో పెళ్ళికావిరోజులు.

అప్పటి సీతాలు వయస్సు పదహారేళ్ళు.

ఎత్తుకి తగ్గ ఒళు.. దానిమ్మ గింజల్లాంటి పళ్ళవరుస. చారదేసి కళ్ళు.కనులకింపైన చెక్కిళ్లు. పిరుదల వరకు వ్రేలాడెనల్లటి త్రాచుపాములాంటి జడ-అప్పటి సీతాలు అంగసౌష్టవం.

సీతాలు లేడిలా చెంగు చెంగున గెంతులేస్తూ ఎంతటి పనయినా యిట్టే చేసుకు పోయేది-సీతాలు అసలు పేరు సీత చనిపోయిన తల్లికి గుర్తుగా వాళ్ళయ్య పెట్టిన పేరది-కాని, ఇంటా బయటా సీతాలుగానే పిలిచేవారు-అదే ఆఖరికి ఖాయమయ్యింది కూడ పాల పొంగు వయస్సులో రంగడితో పెళ్ళయింది. తాగడమంటే అలవాటు లేని రంగడు తాను తెచ్చిన సంపాదనంతా సీతాలుకు యిచ్చేవాడు. దాపరికం లేకుండా మసలేవాడు-పెళ్ళయిన అయిదారు సంవత్సరాల వరకు పిల్లలు కలక పెళ్ళయిందంతో సీతాలు దిగాలుగా వుండేది-ఎట్లాగో కొన్నాళ్ళకు రావుడు కడుపులో పడ్డాడు. ఎంతో సంబరపడిపోయింది. మరో అరేళ్ళకు అయిదుగురి పిల్లల తల్లై కూర్చుంది-కాని ఆరోగ్యం మటుకు దెబ్బతిందనే చెప్పాలి. ఆ ఉత్సాహమూ. ఆ కళా హారతి కర్పూరంలా హరించి పోయాయి

ఇప్పుడు రంగడు చాలా మారిపోయాడు. తాగడం కూడ నేర్చుకున్నాడు. తెచ్చిన డబ్బులు ఇంటికి సరిగా యివ్వకుండా వుండడం కూడ బాగా నేర్చాడు. అంతేకాదు! అప్పుడప్పుడు విసాలో సీతాలు పై విరుచుకు పడుతుంటాడు కూడా! పిల్లల్ని పెంచడమే అన్నిటికన్నా పెద్ద చిక్కై కూర్చోవడంతో చిన్న చిన్న కూలి పనులకు కూడా పోతుంది. అయినా దినదినం అతి భారంగా గడ్డుగా గడుస్తోంది. పాత జీవితాన్ని నెమరువేసుకుని అప్పుడప్పుడు సీతాలు తనలో తాను పూరట పొందడం పరిపాటయింది.

* * *

# రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు ప్రచురణార్హము కానిచో త్రిప్పి పంగోరువారు తగినన్ని స్టాంపులు ... కింలను కవర్లుజతపరచి పంపవలసినదిగా కోరుతున్నాము. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

కథలు పుల్‌స్కేప్‌సైజులో పది పేజీలు, వ్యాసాలు నాలుగు పేజీలు మించకుండా పంప ప్రార్థన.

—ఎడిటర్.

"సీతాలూ"

ఒక్కసారి ఉలుక్కిపడి సీతాలు వాస్తవ ప్రపంచంలోకి వచ్చింది. రంగడ్ని చూసి వడ్డించడానికి లేచి వెళ్ళింది. నిషాలో కనుబొమ్మలు అతికష్టంపై పైకెత్తేందుకు ప్రయత్నిస్తూ. అటూ ఇటూ తూలుతూ మలక మంచంపై కూలబడ్డాడు.

"సీతాలూ .. సీతాలూ, .వన్నంపెట్టె" మళ్ళీ కేకలేశాడు

"వామావా, కూడెట్టాను"

"జగమే మాయ .. బ్రతుకే మాయ" ఏవో కూని రాగాలు తీస్తూ అన్నంముందు కూర్చున్నాడు

చంటివాళ్ళ ఉయ్యాలలో వేసెందుకు వెళ్ళింది సీతాలు.

"ఏంటె ...ఇదేనేటి కూర?" ఒక్కసారిగా గట్టిగా అడిగాడు రంగడు.

"అవును మావా" నెమ్మదిగా. అతి భయంగా, పక్కనాటకు చేరబడి గుండెల్ని చేతితో పట్టుకుంటూ అంది సీతాలు.

"బొమ్మిడాలు తెచ్చి ఆ పోలిగాడు అమ్మేడు కదటే కొని కూరొండకుండా ఈ ఎనవ పకోడీలు కూడు ముందల పడేస్తావా?" తాగుడు వలన అసలే ఎరుపెక్కిన కళ్ళు మరింత ఎరుపెక్కుతుండగా కోపంతో అన్నాడు.

సీతాలు నోటంట మాట రాలేదు. పెదాలు వణుకుతున్నాయి.

"ఏవే వంజా. నిన్నే....బెల్లం కొట్టిన రాయిలా మాటాడవేం?" రెట్టించాడు రంగడు.

"నువ్వు యిచ్చేసిన డబ్బులకి కూరా నారా ఎట్టాగ వత్తాది? ఇంకొక రేత్తే అయితే గెంజి మెతుకులు కూడా పోయదు. కొంపలోకి కూడూ బట్ట సూడ్నోడి నుక్కేసుకునేందుకు ఎనుకాడవు. నా వుసురూ, పిల్లల వుసురూ ఎలా తగులుతాదో. పెళ్ళాం పిల్లల్ని సూడలేని పీ జనమం వున్నా ఒకటే . " దుఃఖానంతట్నే ఒక్కసారి వెళ్ళగక్కుతూ అన్నాదో లేదో సీతాలు చెంప ఛెళ్ళుమంది అసలే నీరు నిండిన కళ్ళు ఒక్కసారి బిగుసుకున్నాయి. దాంతో ఎప్పటో దాగున్న కన్నీటి బొట్లు నేలపై పడ్డాయి. బైర్లుకమ్మిన కళ్ళు తెరిచేలోపల రంగడి కాలు అన్నంగిన్నెను పైకెగరేసింది. మరుక్షణం కొంపంతా అన్నం మెతుకులతో నిండింది. అన్నం గిన్నె గోడకు తగిలిన శబ్దానికి పిల్లలు గొల్లుమంటూ లేచారు.చిరుదీపపు కాంతిలో సీతాలుకు ఎదో అంతా మసక మసకగా కనబడింది, తన జుత్తు రంగడి చేతిలో చిక్కుకుని వుండడం చూసి కంగారుపడిపోయింది సీతాలు. జుత్తును మరీ గట్టిగా నలిపి పైకుత్తుతూ.

"ఏటే నాయాలి పెలపెలమని పేలుతున్నావ్? పీకంత మునకనైపోయావె వంజా! ఇప్పుడు పేసే నాయాలా.... దొంగనాయాలి..."ఏవేవోతిడుతూ ఒక్క

పారి బలంగా చేతితో ముంపుకు కుదిపి ఓ తన్ను బలంగా తన్నాడు. ఆ తన్నుకు రెండడుగుల దూరంలో వున్న గోడపై పడి వెంటనే నేలపై కుప్పలా కూలింది.

నొసటిపై నెత్తురు చోటు చేసుకుంది. పైట స్థానం తప్పింది. జుత్తు ముడి విడింది.

సీతాలు అతికష్టంపై లేవబోయింది. పైటను సర్దుకోబోయింది. జుత్తును సరి చేసుకోబోయింది. చేయీ కాలూ వణుకు తున్నాయ్ తప్ప వాటి వాటి పనులు చెయ్యడం మానుకున్నట్లు ఎచ్చటివచ్చట వున్నాయ్.

మరి కాసేపటికి. అతి కష్టంపై ముఖాన్ని పైకెత్తి సీతాలు చూసేసరికి ఓ బంగారపు ముక్కుపోగున్న చిన్న రేకు డబ్బా పట్టుకుని తూలుతూ గుమ్మం దాటు తున్న రంగడు కపించాడు. వెళ్ళి ఆప బోయింది. బంగారపు ముక్కుపోగున్న రేకు డబ్బా తీసేసుకుందామనుకుంది. కాని కాళ్ళాడడంలేదు. నోటంట మాట రావ టంలేదు. కళ్ళంట నీరు. నొసటంత రక్తం బొట్లుబొట్లుగా మటుకు నేలపై పడుతున్నాయి. తన రంగడ్ని ఆపి బుద్ధి చెప్పడానికి ఎవ్వరూ రావటంలేదు.ఎందుకు వస్తారు?

అవును ఎందుకు వస్తారు? ఎవ్వరూ సీతాలు గోడు పట్టించుకోరు. అందరూ ఒకటే రకంవాళ్ళు యించు మించుగా వరింగ యీ వేళప్పుడు అల్లర్లుకో నేమాలపేట కన్నీరు కారుస్తుంటారు. ఎవ్వరికగవులు వాళ్ళు చూసుకునే సరికే తెల్లవారిపోతుంది. తనింటి ప్రక్క నున్న సూరిగాడు. సన్నాసిగాడు అసలే లేరాయె. వాళ్ళే వుంటె యింత వరకు రానిచ్చేవారు కాదు. బాగా బుద్ధిచెప్పి వుండేవారు. వాళ్ళిప్పుడు రైల్వే డ్యూటీ లకు వెళ్ళిపోయారు. మరింకెవ్వరు వస్తారు?

ఎవ్వరూ రారు.

సీతాలు స్థితికి మేఘాలు మాత్రం రెండేసి బొట్లు రాలుస్తూ పోతున్నాయా. అన్నట్లు బయట చిటపట చినుకులు పడడం ప్రారంభించాయి.

## చందాదారులకు మనవి

'జ్యోతి' సంవత్సర చందా కోరే వారు పన్నెండు రూపాయలు. దీపావళి ప్రత్యేక సంచికతో సహా అయితే పదహారు రూపాయలు, దీపావళి సంచిక రిజిష్టర్డ్ పోస్టులో పంపే పక్షంలో అయితే పదిహేడు రూపాయిలు పంపవలసినదిగా తెలియజేస్తు న్నాము.

సంచికలు సక్రమంగా మీకు చేర టానికి అడ్రసు వివరంగా వ్రాయండి.

మీ చందా మనియార్డరు ద్వారా గాని. డ్రాఫ్ట్ ద్వారాగాని పంపండి. వివరాలకు; మేనేజర్. జ్యోతి. 7 ఎ శివాజి స్ట్రీట్ టి. నగర్. మద్రాసు-600017కు వ్రాయండి.

—మేనేజర్.